క్లుప్తంగా

లైన్ ట్రిప్పింగ్స్ నమోదు చేయండి

చిత్తూరు కార్పొరేషన్: డివిజన్ పరిధిలో లైన్ ట్రిప్పింగ్స్‌ను నమోదు చేయాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ప్రస్తుతం అడపాదడపా వర్షం పడుతున్నందున అక్కడక్కడ లైన్ ట్రిప్పింగ్స్ అవుతున్నట్లు చెప్పారు. సెక్షన్, సబ్‌స్టేషన్, ఫీడర్, ట్రాన్స్‌ఫార్మర్ వారీగా ఎప్పుడు కరెంటు సరఫరా నిలిచింది? తిరిగి పునరుద్ధరణ ఎప్పుడు చేశారో అనే అంశాలపై నివేదిక ఇవ్వాలన్నారు. దీనిని బట్టి ఎండకాలంలో సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతామన్నారు. దీంతో లో-ఓల్టేజీ సమస్యలు నివారించవచ్చని వివరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ పోతే సకాలంలో పునరుద్ధరించాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా ఏఈ, డీఈలకు తెలపాలని వివరించారు.

పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్యను పెంచండి



ఆస్పత్రిలో సెలైన్ బాటిల్స్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

గుడిపాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ) తెలిపారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఐఓ మాట్లాడుతూ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను మరింతగా పెంచాలని డాక్టర్ సంధ్యకు సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సరైన చికిత్స చేయాలని, 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. చిన్నపిల్లల టీకాలు 100శాతం పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో కాన్పులగది, ల్యాబ్ రూమ్, ఇంజక్షన్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఇంజక్షన్‌లు, సెలూన్ బాటిళ్ల వ్యాలిడిటీని తనిఖీలు చేశారు.

శుభ్రతతోనే రోగాలు దూరం

తవణంపల్లె: శుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిదాపుల్లోకి రావని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 47 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, డీఈఓ పాల్గొన్నారు.

పిలకకు ఎలుక బెడద

- వరి పంటను దెబ్బతీస్తున్న ఎలుకలు
- ఏటా ఖరీఫ్‌లో తీవ్ర నష్టం
- ఆర్థికంగా చితికిపోతున్న రైతులు
- నివారణ చర్యలు చేపట్టాలంటున్న అధికారులు



పిలక దశలో ఉన్న వరి పంటను కొరుకుతున్న ఎలుక

బంగారుపాళెం: వరి పంటకు ఎలుకల బెడద వల్ల రైతులు అధికంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా వరి పంటను ఎలుకలు నాశనం చేస్తున్నాయి. ఆకుమడుల దశ నుంచి పంట కోత కోసే వరకు ఈ సమస్య రైతులకు తప్పడంలేదు. పంట వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చేంత వరకు ఎలుకల బెడద ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో ఈ ఎలుకలు రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఎలుకలను సమర్థవంతంగా అరికట్టాలంటే రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టడం వల్లే సాధ్యమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎలుకల నివారణ చేపట్టకపోతే పంటలో 10 నుంచి 40 శాతం దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో బంగారుపాళెం, తవణంపల్లె, యాదమరి, ఐరాల, పూతలపట్టు మండలాల్లో వరితో పాటుగా ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి, కాయకూరల తోటలకు ఎలుకల బెడద ఉంది. ప్రస్తుతం వరి పంట పిలకలు వేసే దశలో ఉంది. ఈ దశలో ఎలుకల వలన కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఎలుకలు నీటి మట్టానికి 6 సెంటీ మీటర్ల ఎత్తులో వరి పిలకలను కొరికి వేస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు.

గుర్తించే విధానం

ఎలుకలు సంచరించే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడిఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన వ్యర్థాల ద్వారా వాటి ఉనికిని సులభంగా గుర్తించవచ్చు.

నివారణ చర్యలు

ముందుగా రైతులు పొలం గట్లపై కలుపు మొక్కలను పూర్తిగా తొలగించి శుభ్రం చేసుకోవాలి. బ్రోమోడయోలిన్ ఎరతో ఎలుకలను సామూహికంగా నివారించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల బ్రోమోడయోలిన్ మందు, 10 గ్రాముల నూనెతో 500 గ్రాముల ఎరను తయారు చేయవచ్చు. ఈ ఎర 50 బొరియలకు సరిపోతుంది. గ్లౌజ్‌లు వేసుకుని మనిషి చేతులు తగలకుండా ఎలుకల మందు తయారు చేసుకుని 10 గ్రాముల చొప్పున వేరుశనగతో కలిపి పొట్లాలు కట్టినట్లుగా కట్టి ఎలుక బొరియల్లో పెట్టాలి. మొదటి రోజు ఎలుక బొరియలను గుర్తించి మట్టితో కప్పివేయాలి. రెండో రోజు మట్టితో కప్పిన వాటిని చూస్తే తెరుచుకున్న బొరియలు కనిపిస్తాయి. ఆ బొరియల వద్ద 10 గ్రాముల బ్రోమోడయోలిన్ ఎర పొట్లాలను ఉంచాలి. దీంతో ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి. ఇక రెండో విధానంలో వేటగాళ్ల ద్వారా ఎలుక బుట్టలు వేయించి ఎలుకలను అరికట్టవచ్చు. అయితే ఈ విధానంలో వేటగాళ్లకు ఒక్కో ఎలుకకు రూ.50 వరకు తీసుకుంటారు. మరో విధానంతో ఎలుక బొరియలో పొగ పెట్టి ఎలుకలను చంపుతారు. ఇలా చేస్తే ఒక్కో ఎలుకకు రూ.50 నుంచి రూ.60 వరకు తీసుకుంటారు. ఈ రెండు విధానాలు అధిక ఖర్చులతో కూడిన పని కావడంతో రైతులంతా బ్రోమోడయోలిన్ ఎర ద్వారానే ఎలుకల నివారణ చేయడం సులభంగా జరిగే పని అని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఏ విధానంలో చేసినా రైతులంతా సామూహికంగా ఈ పని చేస్తేనే ఎలుకలను సమర్థవంతగా అరికట్టగలమని వారు చెబుతున్నారు.

సామూహిక నిర్మూలనతోనే సాధ్యం

వరి పంటకు ఎలుకల బెడద ఎక్కువగానే ఉంటుంది. రైతులు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎలుకలను నివారించుకోవాలి. వరి దుబ్బులు తీపిగా ఉండడంతో పొట్ట దశలోనే ఎలుకలు వీటిని కొరికి రైతులకు నష్టం కలిగిస్తాయి. బొరియలను గుర్తించి అందులో విషపు ఎరలు, ట్రాప్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎలుకలను నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా ఎరలు పెట్టడం ద్వారానే సమర్థంగా అరికట్టగలం. వరి పంటను ఎలుకల బారి నుంచి కాపాడుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– చిట్టిబాబు, మండల వ్యవసాయాధికారి

ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం 25వ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ పూర్ణలత, ఆప్తమాలజిస్ట్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కళ్లు లేనిదే ప్రపంచం లేదని, కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో అంధత్వ నివారణ కోసం మన కళ్లను మనం కాపాడుకోవడంపై అవగాహన పెంచేందుకు ప్రతి ఏడాది అక్టోబర్ రెండో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అంధత్వ నివారణ సంస్థతోపాటు డబ్ల్యూహెచ్‌ఓతో కలిసి వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రతి వ్యక్తికి కంటి సంరక్షణ ఆవశ్యకతను వివరిస్తారని చెప్పారు. విద్యార్థి దశ నుంచి కళ్ల ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎల్‌డీసీ ఉమాపతి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మానసిక ఆరోగ్యం లేని వ్యక్తి పరిపూర్ణ ఆరోగ్య వంతుడు కాదని, అందుకే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ భానుశేఖర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలో గురువారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వం, అపోలో ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక అనారోగ్యాన్ని చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సాధారణంగా మానసిక రోగులు, రుగ్మతల గురించి మాట్లాడడానికి సమాజంలో ఎంతో సిగ్గు, నిర్లక్ష్య భావం కనబరుస్తారన్నారు. మానసిక ఆందోళనతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ఎప్పుడైతే ఒత్తిడి తన జీవన శైలిపై ప్రభావం చూపించడం జరుగుతుందో వెంటనే మానసిక వైద్యుల సహాయం తీసుకోవాలని చెప్పారు. మన చుట్టూ ఉన్నవారితో కలవడం మనకు మానసిక స్థైర్యాన్ని ఇస్తుందన్నారు. సన్నిహితులతో ఎక్కువ సమయం గడపడం ద్వారా మానసిక శక్తిని పెంచుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు శిరీష, శ్రీవాణి, అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌బాబు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఐరన్ మాత్రలు వాడాలి

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ గర్భవతులకు సూచనలు, సలహాలిచ్చారు. ఐరన్ మాత్రలు తప్పక వాడాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. గర్భవతులు 104, 108, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మొబైల్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక రుగ్మతలు మాయం

ఐరాల: ధ్యానంతో మానసకి రుగ్మతలను దూరం చేసుకోవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. గురువారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని పీహెచ్‌సీలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువతను ఒత్తిడి, మానసిక రుగ్మతల నుంచి వ్యాయామం, ధ్యానం దూరం చేస్తాయని తెలిపారు. శారీరక ఆరోగ్యం బాగుండాలి అంటే మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలన్నారు. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్‌లను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్టుకు గురువారం ఓ దాత నగదు విరాళంగా అందించారు. తమిళనాడు వేలూరుకు చెందిన దామోదర్ రూ.1,00,116 నగదును ఆలయ ఈవో గురుప్రసాద్‌కు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

దశదిశలా దసరా సంబరాలు



చిత్తూరు: రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో గురువారం దుర్గాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు అభిషేక పూజలు కొనసాగాయి. భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూకట్టారు. రాత్రి వివిధ రూపాల్లో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక పండితులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించి కర్పూర హారతులు పట్టారు. భక్తుల రాకతో అమ్మవారి ఆలయాలు, మండపాలు పోటెత్తాయి. గిరింపేటలో ప్రతిష్ఠించిన దుర్గమ్మ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు దిలీప్‌రెడ్డి, మునిశేఖర్ తీర్థప్రసాదాలను వితరణ చేశారు. కట్టమంచిలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో అభయమిచ్చారు. అంకాళపరమేశ్వరి ఆలయంలో ఉదయం కుంకుమ అలంకారం, రాత్రి మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు కటాక్షించారు. కోదండరామస్వామి ఆలయంలోని స్వామివారు రామావతారంలో భక్తులకు కనువిందు చేశారు.

కాళికాదేవిగా పాలేటమ్మ

ఐరాల: దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గ్రామ దేవత పాలేటమ్మ ఆలయంలో అమ్మవారు కాళికాదేవి అలంకారంలో భక్తులకు కటాక్షించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు కాళికాదేవిగా భక్తులకు అనుగ్రహించారు. పాతపాళ్యం ఓం శక్తి ఆలయంలో శాకాంబరిగా, వైఎస్ గేటులోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 500, 200, 100, 50 రూపాయల నోట్లతో చాముండేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



బంగారుపాళెం: శ్రీదుర్గాదేవిగా ముత్యాలమ్మ

ఉభయదారులుగా కస్తూరినాయనపల్లె గ్రామస్తులు వ్యవహరించారు.

రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో దుర్గమ్మ

గుడిపాల: మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు గురువారం రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9గంటలకు అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం మహిళలందరూ కుంకుమార్చన చేసి పూజలు అందుకున్నారు. పల్లూరు గంగమ్మ మహిషాసురమర్దిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

దుర్గాదేవిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం ముత్యాలమ్మ శ్రీదుర్గాదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం బోయకొండ గంగమ్మను దుర్గామాతగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వజ్రాలపురంలో..

మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ గురువారం శ్రీదుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. టి.కురప్పల్లెకు చెందిన రాజేంద్రనాయుడు, రామ్మూర్తినాయుడు, సుబ్బానాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజర్ మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







ఐరాల: మహాలక్ష్మిగా.. కాళికాదేవిగా.., శాకాంబరిదేవిగా.., బంగారుపాళెం: వజ్రాలపురంలో దుర్గామాతగా.., గుడిపాల : మహిషాసురమర్ధినిగా గంగమ్మ